క్లుప్తంగా

దుర్గమ్మకు పూజలు



విశేష అలంకారంలో శ్రీ విజయదుర్గమ్మ

కడప కల్చరల్ : కడప నగరం శ్రీ విజయ దుర్గాదేవి ఆలయంలో మంగళవారం భక్తులు దోష నివారణ కోసం రాహుకాల పూజలను నిర్వహించారు. తొలుత అమ్మవారి మూలమూర్తిని దర్శించుకుని పూజలు చేశారు. అనంతరం ఆలయ ప్రాంగణంలో సామూహికంగా కార్యక్రమాన్ని నిర్వహించారు. ఆలయ అర్చకులు పూజా విధానాన్ని తెలుపుతూ కార్యక్రమాన్ని నిర్వహింపజేశారు. భక్తులు అమ్మవారికి నిమ్మకాయ దీపాలను వెలిగించి మొక్కుకున్నారు.

పుస్తకాల వితరణ



విద్యార్థులకు హ్యాండ్ రైటింగ్ బుక్స్‌ను అందచేస్తున్న ఎంఈఓ-2 ఇర్షాద్ అహ్మద్

కడప ఎడ్యుకేషన్ : కడప నగర శివార్లలోని వక్కలపేట మున్సిపల్ కార్పోరేషన్ ఉర్దూ ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు ఆ పాఠశాల హెడ్ టీచర్, ఎస్టీయూ జిల్లా కార్యదర్శి నజీముల్లా హ్యాండ్ రైటింగ్ బుక్స్, నోట్ బుక్స్, పెన్స్ వితరణగా ఇచ్చారు. ఈ కార్యక్రమానికి కడప ఎంఈఓ-2 ఇర్షాద్ అహ్మద్, ఎస్టీయూ జిల్లా అధ్యక్షుడు ఎస్ఎండీ ఇలియాస్‌బాషలు హాజరై వాటిని విద్యార్థులకు అందచేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నేటి పోటీ ప్రపంచంలో పిల్లలకు చక్కటి రాత, కమ్యూనికేషన్ చాలా ముఖ్యం అన్నారు.

విరాళాల సేకరణ



విరాళాలు సేకరిస్తున్న సీపీఐ నాయకులు

కడప వైఎస్ఆర్ సర్కిల్ : విజయవాడలో బుడమేరు వరదల వల్ల నష్టపోయిన ప్రజల సహాయార్థం సీపీఐ ఆధ్వర్యంలో విరాళాల సేకరణ చేపట్టినట్లు సీపీఐ జిల్లా కార్యదర్శి చంద్ర పేర్కొన్నారు. మంగళవారం నగరంలో సీపీఐ నాయకులు విరాళాల సేకరణ చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రకృతి వైపరీత్యాలు సంభవించినప్పుడు పెద్ద ఎత్తున ప్రాణ, ఆస్తి నష్టాలు జరుగుతాయని, అలాంటి సందర్భంలోనే ప్రజలు పెద్ద ఎత్తున సహాయ సహకారాలు అందించి బాధితులకు అండగా నిలబడి మనోధైర్యాన్ని నింపాలన్నారు. కుల మత ప్రాంత రాజకీయాలకతీతంగా వరద బాధితులకు అండగా నిలవాలన్నారు.

క్విజ్ విజేతలకు అభినందన



క్విజ్ విజేతలను అభినందిస్తున్న ఢిల్లీ పబ్లిక్ స్కూల్ యాజమాన్యం

వైవీయూ/కడప ఎడ్యుకేషన్ : కడప నగరంలోని ఇంటర్నేషనల్ ఢిల్లీ పబ్లిక్ స్కూల్‌కు చెందిన భానుతేజేశ్వర్‌రెడ్డి, భరత్‌కుమార్‌రాజులు జాతీయస్థాయి క్విజ్ పోటీల్లో సత్తాచాటి రెండో స్థానంలో నిలిచినట్లు ఇంటర్నేషనల్ ఢిల్లీ పబ్లిక్ స్కూల్ డైరెక్టర్ ఎం. వివేకానందరెడ్డి తెలిపారు. యూనియన్ బ్యాంకు ఆధ్వర్యంలో నెల్లూరులో నిర్వహించిన ఈ పోటీల్లో జాతీయ స్థాయిలో 976 మంది విద్యార్థులు పోటీపడగా పాఠశాలకు చెందిన వీరు రెండోస్థానంలో నిలిచి రన్నరప్ ట్రోఫీ కైవసం చేసుకున్నట్లు ఆయన తెలిపారు. ఈ సందర్భంగా రన్నరప్‌గా నిలిచిన విద్యార్థులను పాఠశాలలో ఘనంగా సత్కరించారు.

జాతీయస్థాయి తైక్వాండో పోటీల్లో పతకాలు



విజేతలతో మాస్టర్ నాయబ్‌రసూల్

పోరుమామిళ్ల : ఉత్తరప్రదేశ్‌లోని ఆగ్రాలో ఈనెల 9, 10 తేదీల్లో జరిగిన జాతీయస్థాయి తైక్వాండో పోటీల్లో పోరుమామిళ్లకు రెండు కాంస్య పతకాలు దక్కాయని మంగళవారం మాస్టర్ నాయబ్ రసూల్ తెలిపారు. సబ్ జూనియర్స్ 21 కేజీల విభాగంలో నదీశ్, జూనియర్స్ విభాగంలో సాయికృష్ణ తేజ కాంస్య పతకాలు సాధించారన్నారు. జిల్లా తైక్వాండో అధ్యక్షుడు శివశంకర్‌రెడ్డి, కోచ్ సుభాష్ ఉస్మాన్ పతక విజేతలను అభినందించారు.

• ఘనంగా గణేష్ నిమజ్జనం



నిమజ్జనానికి పయనమైన వైవీయూ గణేశుడు

వైవీయూ : యోగివేమన విశ్వవిద్యాలయం ప్రధాన ద్వారం వద్ద ఏర్పాటుచేసిన ఎకో ఫ్రెండ్లీ గణేషుడి విగ్రహాన్ని బ్యాండ్ మేళాల మధ్య మంగళవారం ఘనంగా ఊరేగించారు. ముందుగా వైస్ చాన్సలర్ ప్రొఫెసర్ కె. కృష్ణారెడ్డి, రిజిస్ట్రార్ ఆచార్య ఎస్.రఘునాథ రెడ్డి, విద్యార్థులు, అధ్యాపకులు, బోధనేతర సిబ్బంది వినాయకుడికి పూజలు చేశారు. వైవీయూ గణేష్ ఉత్సవ కమిటీ ప్రతినిధులు వంశీకృష్ణ, చంద్రశేఖర్, భరత్ కుమార్, రజిత, మనీషి, సృజన, దీపిక, దేవామ్సీ తదితరులు పాల్గొన్నారు.

• ప్రకృతినగర్‌లో ముగ్గుల పోటీ



ఆకట్టుకున్న వినాయకుడి చిత్రం

కడప ఎడ్యుకేషన్ : వినాయక చవితి ఉత్సావాల్లో భాగంగా మంగళవారం కడప ప్రకృతినగర్‌లో ప్రకృతినగర్ వెల్ఫేర్ అసోసియేషన్ ప్రెసిడెంట్ జయసుబ్బారెడ్డి ఆధ్వర్యంలో కాలనీ మహిళలకు వినాయక చవితి రంగోలి పోటీలను(ముగ్గుల పోటీలు) నిర్వహించారు. ఈ ముగ్గుల పోటీలలో ప్రథమ, ద్వితీయ, తృతీయస్థాయిలో నిలిచిన విజేతలకు బుధవారం వినాయక నిమజ్జన కార్యక్రమాన్ని పురస్కరించుకుని బహుమతులను ప్రదానం చేస్తామని జయసుబ్బారెడ్డి తెలిపారు. వీటితోపాటు నిమజ్జనం రోజు కూడా పలు రకాల పోటీలను నిర్వహిస్తామని తెలిపారు.



ప్రకృతినగర్‌లో ముగ్గులు వేస్తున్న కాలనీ మహిళలు

• లడ్డూ వేలంపాట



లడ్డూను స్వీకరించిన భక్తులు

కడప కోటిరెడ్డిసర్కిల్ : వినాయక చవితి ఉత్సవాల్లో భాగంగా కడప నగరం వివేకానంద నగర్ (ఓం శాంతినగర్)లో నిర్వహించిన శ్రీ వరసిద్ధి వినాయక చవితి ఉత్సవాల్లో లడ్డూ ప్రసాదం రూ. 2 లక్షల 8 వేలు పలికింది. నహర్ కలర్స్ అండ్ కోటింగ్ ప్రైవేట్ లిమిటెడ్ జనరల్ మేనేజర్ లావులూరి రామకృష్ణ (రాధ) ఈ లడ్డూను దక్కించుకున్నారు. గత మూడు సంవత్సరాలుగా లావులూరి రామకృష్ణ వేలం పాటలో లడ్డూను దక్కించుకుంటున్నారని ఉత్సవ నిర్వాహకులు తెలిపారు.

ఘనంగా వినాయక చవితి ఉత్సవాలు



కొండాయపల్లె వినాయకుని సన్నిధిలో మేయర్ సురేష్ బాబు, మాజీ డిప్యూటీ సీఎం అంజద్‌బాషా

కడప కార్పొరేషన్ : కడప నగరంలో వినాయక చవితి వేడుకలు ఉత్సాహంగా సాగుతున్నాయి. మంగళవారం కడప నగరంలోని మాసాపేటలో మాలా ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన అన్నదాన కార్యక్రమాన్ని మాజీ డిప్యూటీ సీఎం అంజద్‌బాషా ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజలందరికీ వినాయక చవితి శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్ షఫీ పాల్గొన్నారు.

■ కడప నగరంలోని కొండాయపల్లెలో ఏర్పాటు చేసిన వినాయక విగ్రహం వద్ద వైఎస్సార్‌సీపీ నాయకుడు శంకరాపురం సింధు ఆధ్వర్యంలో మేయర్ సురేష్ బాబు, మాజీ డిప్యూటీ సీఎం అంజద్‌బాషా ప్రత్యేక పూజలు నిర్వహించి తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. అనంతరం సింధు వారిని ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో 10వ డివిజన్ కార్పొరేటర్ మల్లికార్జున, 25వ డివిజన్ కార్పొరేటర్ కె. సూర్యనారాయణరావు, యల్లారెడ్డి, రామ్మోహన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఆర్టీసీ పురోభివృద్ధిలో డ్రైవర్ల పాత్ర కీలకం



మాట్లాడుతున్న జిల్లా ప్రజా రవాణాధికారి గోపాల్ రెడ్డి

కడప కోటిరెడ్డిసర్కిల్ : ఆర్టీసీ సంస్థ పురోభివృద్ధిలో డ్రైవర్ల పాత్ర కీలకమని గుర్తించాలని జిల్లా ప్రజా రవాణాధికారి పొలిమేర గోపాల్‌రెడ్డి సూచించారు. మంగళవారం స్థానిక ఆర్ఎం కార్యాలయ కాన్ఫరెన్స్ హాలులో కడప రీజియన్ పరిధిలోని డ్రైవర్లకు ఫిర్యాదులు, డ్యామేజ్, అత్యల్ప ఇంధన పొదుపు తదితర అంశాలపై శిక్షణా కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా గోపాల్‌రెడ్డి మాట్లాడుతూ బస్సును సకాలంలో గమ్యస్థానాలకు క్షేమకరంగా చేర్చడంలో డ్రైవర్లు జాగరూకతతో వ్యవహరించాలన్నారు. ముఖ్యంగా ఆర్టీసీని ప్రమాద రహిత సంస్థగా తీర్చిదిద్దేందుకు ప్రతి డ్రైవర్ కృషి చేయాలన్నారు. అలాగే ప్రయాణీకుల నుంచి ఎలాంటి ఫిర్యాదులు రాకుండా చూసుకోవాల్సిన బాధ్యత ఉందన్నారు. ఇంధన పొదుపు చేయడం ద్వారా సంస్థకు ఆదాయం చేకూర్చిన వారవుతారన్నారు. విధి నిర్వహణ సమయంలో డ్రైవర్లు చాలా అప్రమత్తంగా ఉండాలన్నారు. అనంతరం బద్వేలు డిపో మేనేజర్ శ్రీనివాస్ కేఎంపీఎల్ పెరుగుదలకు ఆచరించాల్సిన పంచసూత్రాలను, అత్యాధునిక టెక్నాలజీతో తయారు చేసిన బీఎస్-6 వాహనాల గురించి తెలియజేశారు. అనంతరం రీజినల్ సేఫ్టీ డ్రైవింగ్ ఇన్‌స్ట్రక్టర్ సుధా కృష్ణారెడ్డి, బద్వేలు డిపో ఎస్‌డీఐ నరసింహారెడ్డి ఇంధన పొదుపు, డ్రైవింగ్ సూచనలు, రహదారి నిబంధనలు తెలియజేశారు.

వైవీయూలో బీకాం ఆనర్స్ నూతన కోర్సు ప్రారంభం



మాట్లాడుతున్న వైవీయూ వీసీ ఆచార్య కె. కృష్ణారెడ్డి

వైవీయూ : యోగివేమన విశ్వవిద్యాలయం క్యాంపస్‌లో బీకాం ఆనర్స్ నూతన కోర్సును ప్రారంభించినట్లు వైస్ చాన్సలర్ ఆచార్య కె. కృష్ణారెడ్డి పేర్కొన్నారు.

మంగళవారం బీకాం ఆనర్స్ కోర్సు ప్రారంభోత్సవ కార్యక్రమంలో వీసీ మాట్లాడుతూ కామర్స్ కోర్సు చదివిన వారికి ఉద్యోగ ఉపాధి అవకాశాలు మెండుగా ఉన్నాయని అయితే ప్రభావంతంగా కోర్సు పూర్తి చేయాలని సూచించారు. విశ్వవిద్యాలయంలో డిగ్రీ కోర్సు ప్రారంభించడం ఇదే మొదటిసారని అన్నారు. విశ్వవిద్యాలయంలో ఉన్న సదుపాయాలు, వనరులను విద్యార్థులు వినియోగించుకోవాలన్నారు. రిజిస్ట్రార్ ఆచార్య ఎస్. రఘునాథ రెడ్డి, కళాశాల వైస్ ప్రిన్సిపాల్ ఆచార్య పుత్తా పద్మ, కామర్స్ విభాగం డీన్ ఆచార్య వై. సుబ్బరాయుడు, కామర్స్ విభాగాధిపతి ఆచార్య విజయభారతి మాట్లాడుతూ యూనివర్సిటీలో కామర్స్ కోర్సును ప్రారంభించడం సంతోషదాయకమన్నారు. కార్యక్రమంలో సహాయ ఆచార్యులు డాక్టర్ హరినాథ్, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

డీఈఓ కార్యాలయ సిబ్బందిపై చర్యలు తీసుకోవాలి



ఆర్‌జేడీకి వినతిపత్రాన్ని సమర్పిస్తున్న ఉపాధ్యాయ సంఘ నాయకులు

కడప ఎడ్యుకేషన్ : మద్యం తాగి ఉపాధ్యాయ సంఘ నేతలను అసభ్య పదజాలంతో దూషించిన కడప జిల్లా విద్యాశాఖ అధికారి కార్యాలయ సిబ్బందిపై చర్యలు తీసుకోవాలని ఉపాధ్యాయ సంఘ నాయకులు కోరారు. ఈ విషయమై మంగళవారం పాఠశాల విద్య ఆర్‌జేడీ కాగిత శామ్యూల్‌ను కలిసి వినతిపత్రాన్ని సమర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఇటీవల ఉత్తమ ఉపాధ్యాయ అవార్డుల విషయమై సమస్యను అడిగేందుకు వెళ్లిన ఉపాధ్యాయులపై డీఈఓ కార్యాలయ సిబ్బంది దురుసుగా ప్రవర్తించారన్నారు. విచారించి చర్యలు తీసుకోవాలని కోరారు. ఆర్‌జేడీని కలిసిన వారిలో పీఎస్‌టీయూ రాష్ట్ర అధ్యక్షులు లెక్కల జమాల్‌రెడ్డి, ఎస్‌టీఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు రామాంజనేయులు, ఎస్‌టీయూ మాజీ ప్రధాన కార్యదర్శి వెంకటసుబ్బయ్య, బహుజన టీచర్స్ అసోసియేషన్ జిల్లా ప్రధాన కార్యదర్శి హరి కొండయ్యలతోపాటు ఎస్‌టీఎఫ్ నాయకులు రామచంద్ర, ఆవుల శ్రీనివాసులు, ఆలమూరు ప్రసాద్, సాగర్, బాలకృష్ణ, రాజగోపాల్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఇ-క్రాప్ తప్పనిసరిగా చేయించుకోవాలి



వరి పంటను పరిశీలిస్తున్న జిల్లా వ్యవసాయాధికారి నాగేశ్వరరావు

వల్లూరు : ఖరీఫ్‌లో పంట సాగు చేసిన రైతులందరూ తప్పని సరిగా ఇ-క్రాప్ నమోదుతో పాటు ఇ-కేవైసీ చేయించుకోవాలని కమలాపురం వ్యవసాయ సహాయ సంచాలకులు నరసింహారెడ్డి తెలిపారు. తోల్లగంగనపల్లె రైతు సేవా కేంద్రంలో జరుగుతున్న ఇ-పంట, ఇ-కేవైసీ నమోదు కార్యక్రమాన్ని మంగళవారం ఆయన పరిశీలించి మాట్లాడారు. ఖరీఫ్ సీజన్‌కు సంబంధించి మండలంలో ఇప్పటి వరకు 1628 మంది రైతులు 4769 ఎకరాల్లో వరి, మినుము, పత్తి మొదలైన పంటలు సాగు చేశారన్నారు. ఇందులో 832 మంది రైతులు ఇప్పటికే ఇ-కేవైసీ కూడా చేయించుకున్నారన్నారు. పంట సాగు చేసి ఇప్పటి వరకు ఇ-క్రాప్ నమోదు చేయించుకోని రైతులు వెంటనే తమ పరిధిలోని రైతు సేవా కేంద్రానికి వెళ్లి అగ్రికల్చర్ అసిస్టెంటును కలిసి ఇ-క్రాప్ నమోదు చేయించుకోవాలన్నారు. కార్యక్రమంలో మండల వ్యవసాయ శాఖ అధికారిణి సాయిజ్యోతి, అగ్రికల్చర్ అసిస్టెంట్ ఇంద్రజ, రైతులు పాల్గొన్నారు.

మేలైన యాజమాన్య పద్ధతులతో అధిక దిగుబడి

మైదుకూరు : మేలైన యాజమాన్య పద్ధతులతో మిరప పంటలో అధిక దిగుబడిని సాధించవచ్చని మండలంలోని వనిపెంట కృషి విజ్ఞాన కేంద్రం అధిపతి, శాస్త్రవేత్త డాక్టర్ ఎం.బాలకృష్ణ అన్నారు. కేంద్రంలో మంగళవారం ఉద్యాన పంటలపై రైతులకు ఐదు రోజుల శిక్షణా కార్యక్రమం ప్రారంభమైంది. ఈ సందర్భంగా డాక్టర్ బాలకృష్ణ మాట్లాడుతూ మిరప సాగులో సమగ్ర పోషక యాజమాన్యంతో నాణ్యమైన పంటతో పాటు, అధిక దిగుబడిని పొందవచ్చని పేర్కొన్నారు. సేంద్రీయ ఎరువుల ఆవశ్యకత, పచ్చిరొట్ట ఎరువులు, జీవ రసాయన ఎరువులపై రైతులకు అవగాహన కల్పించారు. శాస్త్రవేత్తలు శ్రీవిద్యారాణి పసుపులో సమగ్ర సస్యరక్షణ చర్యలపై, ఫిరోజ్ హుస్సేన్ మేలైన యాజమాన్య పద్ధతులు, మిరప రకాలు, చీడపీడలపై బీఎస్ కాంతిశ్రీ మిరపలో విలువ ఆధారిత పదార్థాలపై మాట్లాడారు.

బీబీఏ కోర్సుకు అనుమతులు

వైవీయూ : కడప నగరంలోని ఎస్‌కేఆర్ అండ్ ఎస్‌కేఆర్ ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలో బీబీఏ కోర్సుకు అన్ని అనుమతులు లభించినట్లు కళాశాల ప్రిన్సిపాల్ డా. వేమల సలీంబాషా తెలిపారు. ఆసక్తి గల విద్యార్థులు కళాశాలలో బీబీఏ కోర్సులో ప్రవేశాలు పొందవచ్చని తెలిపారు. పూర్తి వివరాలకు కళాశాలలో సంప్రదించాలని సూచించారు.

విశాఖ ఉక్కు ప్రైవేటీకరణ ఆపాలని ధర్నా

కడప సెవెన్‌రోడ్స్ : కేంద్రంలోని మోదీ ప్రభుత్వం విశాఖ ఉక్కుతోపాటు ప్రభుత్వ రంగ సంస్థల ప్రైవేటీకరణ ఆపాలని డిమాండ్ చేస్తూ రాష్ట్ర పిలుపులో భాగంగా కార్మిక సంఘాలు మంగళవారం ఆర్టీఓ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించాయి. సీపీఐ జిల్లా కార్యదర్శి జి.చంద్ర, ఏఐటీయూసీ, సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శులు ఎల్.నాగసుబ్బారెడ్డి, బి.మనోహర్‌లు మాట్లాడుతూ గత పదేళ్ల కాలంలో మోదీ అనుసరించిన కార్పొరేట్ అనుకూల విధానాలు దేశంలో పేదరికాన్ని పెంచాయని విమర్శించారు. నిరుద్యోగం, అసమానతలు పెరిగి ప్రజల ఆదాయాలు పడిపోయాయన్నారు. అన్నదాతల ఆత్మహత్యలు రెట్టింపు అయ్యాయని పేర్కొన్నారు. విశాఖ ఉక్కు ఫ్యాక్టరీకి సొంత గనులు కేటాయించకుండా కేంద్రం నిర్లక్ష్యం వహిస్తోందన్నారు. ఆంధ్రప్రదేశ్‌కు విభజన చట్టంలోని హామీ మేరకు కడప స్టీల్ ప్లాంటు ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. నిత్యావసర సరుకుల ధరల అదుపునకు ఎలాంటి చర్యలు తీసుకోకపోవడం విడ్డూరమన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ సంస్థల్లో ఖాళీగా ఉన్న పోస్టులను తక్షణమే భర్తీ చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఏఐటీయూసీ, సీఐటీయూ జిల్లా అధ్యక్షులు వేణుగోపాల్, శ్రీనివాసులురెడ్డి, నాయకులు కేసీ బాదుల్లా, ఏఐటీయూసీ నగర అధ్యక్ష, కార్యదర్శులు నరసింహులు, తారక రామారావు, ఏపీ రైతు సంఘాల నాయకులు ఎంవీ సుబ్బారెడ్డి, దస్తగిరి రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ ఆసుపత్రుల్లోనే కాన్పులు సురక్షితం

కమలాపురం : ప్రభుత్వ ఆసుపత్రుల్లోనే కాన్పులు సురక్షితంగా చేస్తామని, గర్భిణులందరూ ప్రభుత్వ ఆసుపత్రుల్లోనే ప్రసవాలు చేసుకోవాలని పెద్దచెప్పలి పీహెచ్‌సీ మెడికల్ ఆఫీసర్ జావలి ప్రసూన తెలిపారు. మంగళవారం స్థానిక పీహెచ్‌సీలో నిర్వహించిన ప్రధాన మంత్రి మాతృత్వ అభియాన్ సురక్షిత కార్యక్రమంలో ఆమె గర్భిణీలను ఉద్దేశించి మాట్లాడారు.

ప్రతి గర్భిణీ ప్రభుత్వ ఆసుపత్రుల్లోనే కాన్పులు చేసుకోవాలని, ప్రభుత్వ ఆసుపత్రుల్లోనే కాన్పులు సురక్షితంగా చేస్తారన్నారు. గర్భందాల్చే సమయంలోని 12 వారాల గురించి ఆమె వివరించారు. ల్యాబ్‌లో అందించే సేవలు, 108, 104 అందించే సేవల గురించి అవగాహన కల్పించారు. అలాగే హైరిస్క్ గర్భిణులను గుర్తించాలని, మాతా శిశు మరణాలను అరి కట్టేందుకు కృషి చేయాలని సిబ్బందికి సూచించారు. సీజనల్ వ్యాధులైన మలేరియా, డెంగ్యూ, వైరల్ ఫీవర్స్ తదితర రోగాల పట్ల అప్రమత్తంగా ఉండాలన్నారు. పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకునేలా ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. రక్తహీనత ఉన్నా, హైరిస్క్ ఉన్న గర్భిణుల గురించి తక్షణం తమ దృష్టికి తీసుకు రావాలన్నారు. కార్యక్రమంలో గర్భిణులు, వైద్య, ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.

బతికి సాధించాలన్న బలమైన కాంక్ష అవసరం



మాట్లాడుతున్న ఎస్సీ కార్పొరేషన్ ఈడీ డాక్టర్ బ్రహ్మయ్య

వైవీయూ : సమస్యకు భయపడి నిండు జీవితాన్ని మధ్యలోనే తుంచేయక బతికి సాధించాలన్న బలమైన కాంక్ష ఉండాలని ఎస్సీ కార్పొరేషన్ ఈడీ డాక్టర్ వి.బ్రహ్మయ్య అన్నారు. ప్రపంచ ఆత్మహత్యల నివారణ దినోత్సవ సందర్భంగా మంగళవారం ప్రభుత్వ పురుషుల కళాశాల, రాయలసీమ టూరిజం అండ్ కల్చరల్ సొసైటీ, లయన్స్ క్లబ్‌ల ఉమ్మడి ఆధ్వర్యంలో కొండూరు జనార్దన్‌రాజు పర్యవేక్షణలో జరిగిన సమావేశానికి ఆయన ప్రధాన వక్తగా హాజరై మాట్లాడారు. ఈ జీవితం అత్యంత విలువైనదని, జన్మనుసార్థకం చేసుకోవాలన్నారు. మాదక ద్రవ్యాలు, మత్తు పానీయాల సేవనం, విలాసాలు, ఇతరులతో జీవితాన్ని పోల్చుకోవడం మంచిది కాదన్నారు. కళాశాల వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ రమేష్ మాట్లాడుతూ స్వల్ప కారణాలతో విలువైన జీవితాన్ని అంతం చేసుకోకూడదని, ఆలోచన, అవగాహన కలిగి ఉండాలన్నారు. రిటైర్డ్ ఇంజనీరు దేశు వెంకటరెడ్డి మాట్లాడుతూ మానవ జన్మ విలువైనదని, స్వల్ప కారణాలకు దాన్ని బలిపెట్టడం అవగాహన లోపమన్నారు. మానవత కృష్ణారెడ్డి, డాక్టర్ విజయ్‌కుమార్, బాలయల్లారెడ్డిలు మాట్లాడారు.

సీఐ భాస్కర్‌రెడ్డి సేవలు విలువైనవి



సీఐ వీడ్కోలు సమావేశంలో మాట్లాడుతున్న ఎస్ఈ రమణ

కడప కార్పొరేషన్ : విద్యుత్ శాఖకు విజిలెన్స్ సీఐ దారెడ్డి భాస్కర్‌రెడ్డి అందించిన సేవలు ఎంతో విలువైనవని ఏపీఎస్‌పీడీసీఎల్ పర్యవేక్షక ఇంజినీరు ఎస్. రమణ అన్నారు. మంగళవారం బదిలీపై వెళ్తున్న భాస్కర్‌రెడ్డి వీడ్కోలు సభలో ఆయన మాట్లాడారు. భాస్కర్‌రెడ్డి విద్యుత్ సంస్థలోని విజిలెన్సు - ఏ.పి.టి.యస్ విభాగంలో సీఐగా 2018 నుండి పనిచేస్తున్నారన్నారు. విద్యుత్ చౌర్యాన్ని అరికట్టడంలో, సంస్థలో శాంతి భద్రతలు నెలకొల్పడంలో ఉత్తమ ప్రతిభ కనబరిచి పలు అవార్డులు పొందారని గుర్తు చేశారు. సమస్యల పరిష్కారంలో ఒక ఫ్రెండ్లీ పోలీస్ గా ఉన్నతంగా విధులు నిర్వహించారని గుర్తుచేశారు. అనంతరం సీఐ దారెడ్డి భాస్కర్ రెడ్డి మాట్లాడుతూ విధులలో తనకు సహకరించిన ఉద్యోగులకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ సన్మాన సభ లో జిల్లాలోని ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్లు నాగరాజు, నాయక్, రమేష్, రమణారెడ్డి, విజిలెన్సు విభాగం సిబ్బంది, డీఈఈలు, ఏఈలు పాల్గొన్నారు.

చదువుతో పాటు ఎన్‌సీసీ, క్రీడలకు ప్రాధాన్యం



మాట్లాడుతున్న అధ్యాపకులు

వైవీయూ: చదువుతో పాటు ఎన్‌సీసీ, ఎన్ఎస్ఎస్, స్పోర్ట్స్ వంటి ఎక్స్‌ట్రా కరికులర్ యాక్టివిటీస్‌కు ప్రాధాన్యత ఇవ్వాలని ఎస్‌కేఆర్ అండ్ ఎస్‌కేఆర్ ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డా. వి. సలీంబాషా పేర్కొన్నారు. కళాశాలలో నిర్వహిస్తున్న స్టూడెంట్ ఇండక్షన్ ప్రోగ్రాంలో భాగంగా మంగళవారం ఎన్‌సీసీ, ఎన్ఎస్ఎస్ తదితర కళాశాల సౌకర్యాలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎన్ఎస్ఎస్ గురించి ప్రోగ్రాం ఆఫీసర్లు డా. విజయలక్ష్మి, డా. శచీదేవి, ఎన్‌సీసీ గురించి ఎన్‌సీసీ అధికారిణి డా. కృష్ణవేణి వివరించారు. ఎన్‌సీసీ, ఎన్ఎస్ఎస్‌ల ద్వారా కలిగే ప్రయోజనాలను వివరించారు. కార్యక్రమంలో అధ్యాపకులు డా. ప్రకాష్‌నారాయణరెడ్డి, గురుమోహన్‌రెడ్డి, శ్రీనివాసులరెడ్డి, కుమార్, నాగశివాని, విద్యార్థులు పాల్గొన్నారు.

ఉర్దూ పాఠశాలల అసంబద్ధ సర్దుబాటును సరిచేయాలి



కేజీబీవీల రాష్ట్ర కార్యదర్శి మధుసూదన్‌రావుకు వినతిపత్రాన్ని సమర్పిస్తున్న రూట నాయకులు

కడప ఎడ్యుకేషన్ : ఉమ్మడి కడప జిల్లా ఉర్దూ పాఠశాలల ఉపాధ్యాయుల అసంబద్ధ సర్దుబాటు సమస్యను ప్రభుత్వం పరిష్కరించాలని రాష్ట్ర ఉర్దూ టీచర్స్ అసోసియేషన్ కడప, అన్నమయ్య జిల్లా శాఖల ప్రధాన కార్యదర్శులు జాకీర్ హుస్సేన్, సబాతుర్ రెహమాన్‌లు డిమాండ్ చేశారు. మంగళవారం వైఎస్సార్ జిల్లాకు వచ్చిన రాష్ట్ర కేజీబీవీల కార్యదర్శి, జిల్లా నోడల్ అధికారి మధుసూదన్ రావుకు వారు సమస్యను వివరించి వినతపత్రాన్ని సమర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఉమ్మడి కడప జిల్లాలోని ఉర్దూ మీడియం పాఠశాలలలో తెలుగు మీడియం విద్యార్థి ఒక్కడు కూడా లేరన్నారు. అలాంటప్పుడు ఎందుకు ఉర్దూ పాఠశాలల్లో తెలుగు ఉపాధ్యాయులను సర్దుబాటు చేశారని ప్రశ్నించారు. ప్రస్తుతం సర్దుబాటుపై వచ్చిన తెలుగు మీడియం ఉపాధ్యాయులకు కనీసం ఉర్దూ వర్ణమాల కూడా రాదని అన్నారు. పరిశీలించి ఉర్దూ పాఠశాలల విద్యార్థులకు న్యాయం చేయాలని కోరారు. దీనికి స్పందించిన నోడల్ అధికారి మధుసూదన్ రావు మాట్లాడుతూ సంబంధిత సమస్యను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర నాయకులు షబ్బీర్, అయ్యూబ్ పాల్గొన్నారు.

వర్మీ కంపోస్టుతో ప్రయోజనం

వల్లూరు : వర్మీ కంపోస్టును పంటలకు వాడటం వలన అనేక ప్రయోజనాలువున్నాయని శాస్త్రవేత్త డాక్టర్ కే సాయిమహేశ్వరి తెలిపారు. చిన్ననాగిరెడ్డిపల్లెలోని రైతులకు స్థానిక ఆలయంలో మంగళవారం రెండు రోజుల శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె వర్మీ కంపోస్టు ఎరువు తయారీకి కావలసిన పదార్థాలు, పరికరాలను గురించి తెలిపారు. వర్మీ కంపోస్టు తయారీ విధానంతో పాటు తయారీలో తీసుకోవాల్సిన జాగ్రత్తలను గురించి వివరించారు. దాన్ని వాడటం వలన ప్రయోజనాలను గురించి వివరించారు. వానపాముల ఎరువు తయారీ ద్వారా వ్యాపార అభివృద్ధి గురించి, మార్కెటింగ్ విధానం గురించి వివరించారు. రైతులతో పాటు యువత వర్మీ కంపోస్టు తయారీలో అవగాహన పెంచుకుని ప్రయోజనాలను పొందాలన్నారు. కార్యక్రమంలో ఉద్యాన విభాగం శాస్త్రవేత్త డాక్టర్ ఎస్. మానస, మహిళా రైతులు, పలువురు యువకులు పాల్గొన్నారు.

జీవామృతంపై అవగాహన సదస్సు

వల్లూరు (చెన్నూరు) : చెన్నూరు మండలం బయనపల్లెలో ప్రకృతి వ్యవసాయం చేస్తున్న రైతు పుల్లయ్య పొలాన్ని మండల వ్యవసాయ అధికారిణి శ్రీదేవి, జిల్లా ప్రాజెక్టు మేనేజర్ ఎస్‌వీ ప్రవీణ్‌కుమార్, ప్రకృతి వ్యవసాయ విభాగం, వ్యవసాయ శాఖ అధికారులు సందర్శించారు. పసుపులో ప్రకృతి వ్యవసాయ పద్ధతులను రైతులకు వివరించి చీడపీడలు తట్టుకునే ప్రకృతి వ్యవసాయ పద్ధతులను వాడే విధానాలపై సూచనలు ఇచ్చారు. పసుపు పంటలో ఘన జీవామృతం, ద్రవ జీవామృతం వాడుకను రైతులకు తెలియజేశారు. జీవామృతం తయారీ విధానాన్ని తెలియజేశారు. కార్యక్రమంలో ప్రకృతి వ్యవసాయ సిబ్బంది వెంకటయ్య, గ్రామ వ్యవసాయ సహాయకులు చరణ్‌రెడ్డి, మహమ్మద్ రఫీ పాల్గొన్నారు.

రైతు సేవా కేంద్రం తనిఖీ

వల్లూరు (చెన్నూరు) : జిల్లా వ్యవసాయ అధికారి అయితా నాగేశ్వరరావు చెన్నూరు-3 రైతు సేవా కేంద్రాన్ని మంగళవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఇ-పంట, ఇ-కేవైసీ జరుగుతున్న తీరును పరిశీలించారు. ఇ-కేవైసీకి సెప్టెంబర్ 15 చివరి తేదీగా ఉండటంతో ఆలోపు పూర్తి చేసుకోవాలన్నారు. అనంతరం ఆయన వరి, బంతి (చెండు మల్లి) పొలాలను పరిశీలించారు. వరిలో సూడోమనస్ లీటరు నీటికి పది గ్రాములు పిచికారి చేయడం వలన పాముపొడ, అగ్గి తెగులు రాకుండా కాపాడుకోవచ్చునన్నారు. ఈ కార్యక్రమంలో చెన్నూరు మండల వ్యవసాయ అధికారి శ్రీదేవి, రైతులు పాల్గొన్నారు.

